సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way


మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 88 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం | 23.07.2025


# మీకిన్ని.. మాకిన్ని..!

## ఇందిరమ్మ ఇండ్లను పంచుకున్న పార్టీలు

- లబ్ధిదారుల ఎంపికలో గోల్‌మాల్..!
- అర్హు లకు మొండి'చేయి'.. అనర్హు లకు అందలం
- ఇండ్లు ఉన్న వారికే.. మళ్లీ ఇండ్లు మంజూరు!
- జనగామ పట్టణంలో లబ్ధిదారుల ఎంపిక అస్తవ్యస్తం




ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అంతా గోల్ మాల్.. జరిగిందా..? అధికారులు అర్హులకు మొండి'చేయి' చూపి.. అనర్హులకు ఇండ్లు మంజూరు చేశారా..? ముఖ్యంగా జనగామ పట్టణంలో లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా అస్తవ్యస్తంగా సాగిందా..? అంటే అవును అనే సమాధానం వస్తోంది. ఇటీవల అధికారులు మంజూరు పత్రాలు అందించిన వివరాలు చూస్తే ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

- మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి

2లో





మన చౌరాస్తా

Mana Chourasta 23.07.2025 బుధవారం

# మీకిన్ని.. మాకిన్ని..!

## ఇందిరమ్మ ఇండ్లను పంచుకున్న పార్టీలు

- లబ్ధిదారుల ఎంపికలో గోల్‌మాల్..!
- అర్హులకు మొండి'చేయి'.. అనర్హులకు అందలం
- ఇండ్లు ఉన్న వారికే.. మళ్లీ ఇండ్లు మంజూరు!
- జనగామ పట్టణంలో లబ్ధిదారుల ఎంపిక అస్తవ్యస్తం




ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అంతా గోల్ మాల్.. జరిగిందా..? అధికారులు అర్హులకు మొండి'చేయి' చూపి.. అనర్హులకు ఇండ్లు మంజూరు చేశారా..? ముఖ్యంగా జనగామ పట్టణంలో లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా అస్తవ్యస్తంగా సాగిందా..? అంటే అవును అనే సమాధానం వస్తోంది.

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :**

**జనగామ పట్టణంలో** 30 వార్డులు ఉండగా మొదటి విడతలో 292 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందులో మొదటగా 193 మందికి (కాంగ్రెస్) మంజూరు పత్రాలు ఇవ్వాగా.. తాజాగా మరో 99 మందికి (బీఆర్ఎస్) మంజూరు పత్రాలు ఇచ్చారు. అయితే ఇందులో చాలా వరకు అనర్హులు ఉన్నారంటూ ఆయా వార్డుల్లో ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు వారివారి అనుయాయులకు ఇండ్లు మంజూరు చేసుకున్నారనే ప్రతిపక్షాలు ఆరోపిస్తుండగా.. కాంగ్రెస్ కౌన్సిలర్లుగా పనిచేసిన వార్డులకు కావాలనే తక్కువ ఇండ్లు ఇచ్చారని అధికార పార్టీ నాయకులూ అంటున్నారు. మొత్తానికి ఇటీవల జనగామ పట్టణంలో అధికారులు అట్టహాసంగా పంపిణీ చేసిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల లిస్టు చూస్తే ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

### అంతా మిలాకాత్..!

జనగామ పట్టణంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరులో పలు అనుమానాలకు తావిస్తోంది. లబ్ధిదారులు ఎంపిక పారదృకంగా జరుగుతుందని ఉన్నతాధికారులు చెబుతున్నా.. వాస్తవాలు మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మొదట అధికారులు తయారు చేసిన జాబితాను అటు అధికార, ఇటు ప్రతిపక్ష పార్టీలు ఒప్పుకోకపోవడంతో కొంత జాప్యం జరిగినట్టు తెలిసింది. అయితే ఆ తరువాత అధికార, ప్రతిపక్ష పార్టీలు మిలాకత్ అయ్యి 'మీకిన్ని.. మాకిన్ని..' పంచుకున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో మొన్నటి వరకు కాంగ్రెస్ కు చెందిన లీడర్లు ఇండ్ల మంజూరు పత్రాలను అందజేస్తే.. తాజా మంగళవారం బీఆర్ఎస్ కు చెందిన నాయకులు మంజూరు పత్రాలు అందజేయడం మొదలు పెట్టారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో ఉన్న ఓ వార్డుకు కాంగ్రెస్ నుంచి ఒకే ఒక్క ఇంటిని మంజూరు చేశారు. అయితే అది కూడా తమ వార్డు వారికి కాకుండా పక్క వార్డుకు చెందిన వ్యక్తికి ఇచ్చారని అక్కడి వారు ఆరోపిస్తున్నారు. ఇదే వార్డులో టీఆర్ఎస్ నుంచి మరో ఆరుగురికి ఇండ్లు ఇచ్చారు. ఇక వెంకన్నకుంట ప్రాంతాల్లో ఓ వార్డులో నాలుగు ఇండ్లు మంజూరు చేశారు. ఇండ్ల మంజూరుకు ముందు అధికారులు అర్హుల జాబితాలో 21 మంది పేర్లు చేర్చారు. ఆ జాబితాలో వారికి కాకుండా కొత్త వారికి ఇక్కడ ఇల్లు కేటాయించడం విశేషం. ఇక మరికొందరు మాజీ కౌన్సిలర్లు, రెండు, మూడు అంతస్తులతో మేడలు ఉన్న వారికి కూడా ఇండ్లు మంజూరు చేయడం గమనార్హం. అయితే వీరింతా ఆయా ఇండ్లకు ఏటా మున్సిపాలిటీకి ఇంటి, నల్లా పన్నులు కడుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం వారికి ఇల్లు లేదని ధృవీకరించడం కొసమెరుపు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అర్హులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.



**ఈ ఫొటోలు ఉన్న మహిళ పేరు గుండెల్లి జాహ్నవి. జనగామ పట్టణంలోని 14వ వార్డు వాసి. ఈమె భర్త మూడేళ్ల కింద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి కూలి పనులకు వెళ్తూ ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లో జీవనం కొనసాగిస్తోంది. భర్త బతికున్న సమయంలో కొన్న స్థలం ఉండడంతో జాహ్నవి ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు (ఆన్‌లైన్ నంబర్ : 251690/795467) చేసుకుంది. అధికారులు వచ్చి అన్ని సర్వేలు నిర్వహించి అర్హురాలిగా గుర్తించి ప్లాట్ రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, ఫొటోలు, బ్యాంక్ పాస్బుక్ జిరాక్స్ పత్రాలు తీసుకెళ్లారు. మొదటి లిస్టులో పేరు వచ్చిందని చెప్పి మున్సిపల్ ఆఫీసుకు రమ్మన్నారు. తీరా అక్కడికి వెళ్లాక పేరు లేదని తేలింది. అన్ని అర్హతలు ఉన్న తనకు ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటూ జాహ్నవి జూలై 2న మున్సిపల్ ఆఫీస్‌లో మరో మారు లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకున్నా.. ఫలితం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె కోరుతోంది.**



### అనర్హులని తెలిస్తే తొలగిస్తాం..

ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఎలాంటి పొరపాట్లు జరుగలేదు. వచ్చిన దరఖాస్తుల్లో పక్కాగా సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశాం. అందులో ఎవరైనా అనర్హులు ఉన్నట్టు ఎవరైనా గుర్తించి ఫిర్యాదు చేస్తే ఎప్పుడైనా తొలగిస్తాం. అలాగే అర్హులు ఎవరైనా మిస్ అయితే మరోసారి దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తాం.

**- వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, జనగామ**



## సాంకేతిక సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి

### స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఎలాంటి జాప్యం లేకుండా వెంట వెంటనే బిల్లులు వచ్చే విధంగా అధికారులు పర్యవేక్షించాలని, సాంకేతిక సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులకు సూచించారు. స్టేషన్ ఘనపూర్ మండలం తానేదార్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిర్మాణం జరుగుతున్న ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను కలిసి మాట్లాడారు. బిల్లులు వస్తున్నాయా లేదా అని అడిగారు. కొంత మంది బిల్లులు రావడం లేదని తెలపగా వెంటనే అధికారులను వివరణ అడిగారు. అధికారులు బ్యాంక్ సమస్య వల్ల ఆలస్యం అవుతుందని, రెండు రోజుల్లో జమ అవుతాయాని తెలిపారు. మరికొందరికి సాంకేతిక సమస్యల వల్ల ఇబ్బంది ఏర్పడుతుందని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రెండు మూడు రోజుల్లో కలెక్టర్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అధికారులు ఈ సమీక్షా సమావేశానికి పూర్తి స్థాయి సమాచారంతో గ్రామాల వారీగా ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను నోట్ చేసుకుని రావాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు లబ్ధిదారులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## హత్య కేసులో నలుగురి అరెస్టు

**బచ్చనపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేటలో మతిస్థిమితం లేని రాజిరెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు. నాలుగు రోజుల్లోనే నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జనగామ ఏసీపీ చేతన్ నితిన్ మంగళవారం మీడియా తెలియజేశారు. జూలై 17 అర్ధరాత్రి బచ్చన్నపేట సెంటర్‌లో రాజిరెడ్డి అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. సీసీ ఫుటేజ్, టెక్నాలజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులు పురాణం ఉమాసాగర్ అలియాస్ సన్నీ, కోరుబోతుల అరుణ్, కోరుబోతుల రాజు, తంగళ్లపల్లి విజయ్‌లను అరెస్ట్ చేశారు. మృతుడు రాజిరెడ్డి తరచూ ఉమాసాగర్ బండి వద్దకు వచ్చి అతడి తల్లిని చూస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తూ వ్యాపారానికి అంతరాయం కలిగిస్తున్నాడని, అందుకే హత్యకు ప్లాన్ చేసినట్టు విచారణలో తెలిందని ఏసీపీ తెలిపారు. కాగా కేసును వేగంగా ఛేదించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.అబ్బయ్య, ఎస్ఐ హమీద్, సిబ్బంది రాకేష్, రామన్న, అనిల్ కుమార్ యాదవ్, భాను చందర్, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, తిరుపతిలను జనగామ ఏసీపీ అభినందించారు.



## రేణుక ఎల్లమ్మ తల్లికి ఘనంగా పుష్పాభిషేకం

**జనగామ, మన చౌరాస్తా :** బాలాజీ నగర్ మూడో వార్డులో వెలిసిన శ్రీరేణుక ఎల్లమ్మ తల్లికి ఆషాడ మాసం చివరి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు మారుపాక శ్యాంప్రసాద్ వేదమంత్రోచ్చరణల నడుమ పుష్పాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. తులసి, చామంతి, మల్లెలు, కనకాంబరాలు, రోజా, తామర, మొగలిరేకులు వంటి పూలు అమ్మవారికి సమర్పించారు. ప్రకృతి మాత పులకరించి ఎలాంటి వైపరీత్యాలు తలెత్తకుండా అమ్మవారు కరుణిస్తారని, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రతి ఇంట సుఖ సంతోషాలు వెల్లివిరియాలని కోరుకున్నారు.






# చేర్యాల బంద్‌ను సక్సెస్ చేయండి

### జేఏసీ చైర్మన్ ఆర్.పరమేశ్వర్



**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల డివిజన్ సాధన కోసం ఈనెల 25న జరిగే బంద్ ను విజయవంతం చేయాలని చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ పిలుపునిచ్చారు. ఈనెల 25న తలపెట్టిన బంద్ కు సంబంధించిన కరపత్రాలను మంగళవారం కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ చైర్మన్ డాక్టర్ పరమేశ్వర్ మాట్లాడుతూ.. చేర్యాల రెవెన్యూ డివిజన్ గురించి ఈనెల 25న చేపట్టే నాలుగు మండలాల బంద్ విజయవంతం చేయాలని కోరారు. గత ఎన్నికల్లో రెవెన్యూ డివిజన్ అంశం గురించి జనగామలో జరిగిన సభలో నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని అధికారంలోకి వచ్చిన ఒక నెలలోనే రెవెన్యూ డివిజన్ ను ప్రకటిస్తామని అన్నారు. ఇప్పటికైనా 2025 డిసెంబర్ లోపే రెవెన్యూ డివిజన్ ను ప్రకటించాలని అందుకే ఈనెల 25న 4 మండలాల బందు నిర్వహిస్తున్నామని అన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశం చేర్యాల ప్రాంతానికి భౌతిక పరమైన అంశమే కాదు చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల కోరిక చేర్యాల ప్రాంత ప్రజల అస్తిత్వం ఉనికి ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్నది కాబట్టి ఎవరు ఏ రూపంలో జేఏసీలు ఏర్పాటుచేసిన ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి భాగస్వాములు అవుతున్నారన్నారు. గత పది సంవత్సరాల నుండి రెవెన్యూ డివిజన్ జేఏసీ ఆధ్వర్యంలో అన్ని రకాల పార్టీలు జేఏసీలతో మమేకమై పోరాడుతున్నాయని అన్నారు. ఈనెల 25న తలపట్టే బంధు ద్వారా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి తమ ప్రజల యొక్క రెవెన్యూ డివిజన్ ఆకాంక్షను తెలియజేస్తామని అన్నారు. 25న జరిగే బంద్ కోసం సిపిఐ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, న్యూడెమోక్రసీ,ఆర్ఎస్పి, బీఎస్పీ, మాల మహానాడు, ఎమ్మార్పీఎస్, విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం, వివిధ కుల సంఘాలు, యువజన సంఘాలు, అందరూ స్వచ్ఛందంగా తమ మద్దతును తెలియజేసి బంద్ ను విజయవంతం చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో జేఏసీ నాయకులు అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, సనవాల ప్రసాద్, ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, వలబోజు నర్సింహ చారి, పొన్నబోయిన మమత, పోలోజు వెంకటాద్రి, ఎక్కలదేవి సుధాకర్, నంగి కనకయ్య, పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి, సిద్దిరాం భద్రయ్య, పొన్నబోయిన శ్రీనివాస్, నర్సిరెడ్డి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.



## గోపాల్‌నగర్‌లో రేషన్ కార్డుల పంపిణీ

**బచ్చనపేట, మన చౌరాస్తా :** గత బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో పేద లబ్ధిదారులకు రాని రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా 5,60 లక్షల నూతన రేషన్ కార్డులను అందజేసి వారి కల నెరవేర్చిందని గోపాల్ నగర్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు గణపురం నగేష్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని గోపాల్ నగర్ లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. పేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో మూడు నెలల రేషన్ సన్న బియ్యాన్ని ఒకేసారిగా అందించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పస్తం పోచయ్య, వల్లాల సత్యనారాయణ, వద్ది ఎల్లయ్య, చింతల కరుణాకర్, నాగభూషణం, గంగరబోయిన మహేందర్, నీల జంపయ్య, నీల నవీన్, కళ్యాణ్ రామ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ ఆర్థిక సాయం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణ 13వ వార్డుకు చెందిన పసునూరి పురుషోత్తం తండ్రి పసునూరి లక్ష్మీనారాయణ (80) అనారోగ్యంతో రెండు రోజు కింద మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మృతుడి కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు. వారికి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ మేరకు వారికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించగా.. ఆ నగదును బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఉడుగుల నర్సింహులు, నాయకులు గుర్రం నాగరాజు, ఉడుగుల కిష్టయ్య, బొట్ల శంకర్ తదితరులు వారికి అందజేశారు.

# పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం చేసిన యువకులు



**జనగామ, మన చౌరాస్తా :** స్నేహితుడి పుట్టిన రోజు సందర్భంగా సేవాలాల్ సేన జనగామ జిల్లా యువజన అధ్యక్షుడు తేజావత్ మోహన్ నాయక్ గణేష్ నాయక్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజ్ మాట్లాడుతూ మంగళవారం గుగులోతు కిరణ్ పుట్టిన రోజు సందర్భంగా జనగామ జిల్లా ఆసుపత్రిలో రక్త నిధి ఏర్పాటు లక్ష్యంగా జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తేజావత్ మోహన్ నాయక్ గణేష్‌నాయక్ రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకుడని అన్నారు. యువత ఈ విధంగా ఆలోచించడం చాలా శుభదాయకం వీరిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రతి ఒక్కరు స్నేహితులు పుట్టినరోజు సందర్భంగా కేకులు కాకుండా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సుమన్ నాయక్, శ్రీకాంత్ నయ, అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి నరేష్, బొట్ల సాయి, నరసింహులు పాల్గొన్నారు.



# కేరళ మాజీ సీఎంకు ఘననివాళి

జనగామ, మన చౌరాస్తా : జనగామలోని సీపీఎం పార్టీ ఆఫీస్‌లో కామ్రేడ్ అమరజీవి, కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ సంతాప సభ నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ సభలో సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ తదితరులు అచ్యుతానందన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు అన్ని వర్గాల ప్రజల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించి, భూస్వాములు, దోపిడీదారులు చేస్తున్న దోపిడి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించి ప్రజల పక్షాన నిలబడిన నాయకుడు కామ్రేడ్ అచ్యుతానందన్ అన్నారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచే వరకు పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబ రాజు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, సుంచు విజేందర్, బోడ నరేందర్, ఎండి అజారుద్దీన్, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, బూడిది ప్రశాంత్, శాఖ కార్యదర్శిలు లింగాల సుగుణ, కొండ వరలక్ష్మి, బండ సౌందర్య, ఎండి మైవెల్లి, ఎండి మున్నీర్, వెంకటేష్, మాదాసి సుధాకర్, ఉపేందర్, గట్టయ్య, నాగరాజు, మల్లేష్, రాజు, సత్తయ్య, మల్లేష్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ ఫలాలు ప్రజలుకు చేరాలి





## – జిల్లాల ప్రగతిపై మంత్రుల సమీక్ష

జనగామ, మన చౌరాస్తా : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, విభాగాధిపతులతో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షించారు. జనగామ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్, సంబధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవంలో మొక్కలు నాటడడం, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై మంత్రులు సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు కావలసిన ఇసుకను సూర్యాపేట నుంచి తెప్పిస్తున్నామని, ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున ఇసుక కొరత రాకుండా ఉండేందుకు నల్గొండ జిల్లా నుంచి కూడా ఇసుకను కేటాయించాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ.. జిల్లాకు కేటాయించిన 30 లక్షల 50 వేల మొక్కల లక్ష్యాలను సాధించేందుకు వన మహోత్సవం కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలన్నారు. ఇంటింటికి ఆరు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతంగా చేపట్టాలన్నారు. గ్రామాలలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోనూ హాస్పటల్ లో ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటించాలన్నారు. రోజువారీగా నాటిన మొక్కల లక్ష్యాలను పోర్టల్ లో నమోదు చేస్తూ నివేదిక రూపంలో ప్రతిరోజు అందజేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పరిషత్ సీఈవో మాధురి షా, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓ గోపి రామ్, కొమురయ్య, డీఆర్డీవో వసంత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మాలోతు రాజేశ్వరికి డాక్టరేట్

బచ్చనపేట, మన చౌరాస్తా : బచ్చన్నపేట మండలంలోని కేసిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు మాలోతు రాజేశ్వరి పీహెచ్‌డీ డాక్టరేట్‌ను అందుకున్నారు. రాజేశ్వరి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ (పొలిటికల్ సైన్స్), ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీఈడీ, ఆంధ్ర మహిళా సభ కళాశాల నుంచి ఎంఈడీ, ఇక పీహెచ్‌డీని కాకతీయ యూనివర్సిటీ నుంచి పూర్తి చేశారు. ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయ బృందం, స్థానికులు అభినందనలు తెలిపారు.

## కుట్టు మిషన్ అందజేత

చేర్యాల, మన చౌరాస్తా : చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన బొందుగుల చంద్రశేఖర్ గౌడ్ గత సంవత్సరం తాడి చెట్టు ఎక్కి దిగుతున్న క్రమంలో కాలుజారి కిందపడి అతని నడుము భాగం కాళ్లు వెన్నుపూస విరగడం జరిగింది. కుటుంబం అప్పటి నుంచి పేదరికం ఎదుర్కొంటూ అనేక ఇబ్బందులు పడుతుంది. ఈ విషయాన్ని కల్లుగీత కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి బండ కింద అరుణ్ కుమార్ గౌడ్ జనగామ జిల్లా కల్లుగీత కార్మిక సంఘం కార్యదర్శి బాలినే వెంకట మల్లయ్య ద్వారా కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా అనే స్వచ్ఛంద సంస్థ విషయాన్ని తెలుసుకుని అతని భార్య శిరీషకు రూ.20 వేల విలువ గల కుట్టు మిషన్ అందజేశారు. ఆ సంస్థ ప్రతినిధులకు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో కలుగీత కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యులు వడ్లకొండ వెంకటేష్, పచ్చిమట్ల రాములు, నేరెళ్ల నరేష్, ఎలికట్ట రామ్, బూడిద చందు, నగేష్, కీసర నర్సింలు, బొంగుల రాజు, శ్రీనివాస్, ఆరేళ్ల అంజయ్య, లక్ష్మణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు



### ప్రభుత్వ పాఠశాలు, హాస్టల్లలో

## అధికారుల తనిఖీలు

జనగామ, మన చౌరాస్తా : ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషకాలు కలిగిన ఆహారం అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ప్రతి మంగళవారం మండల అధికారులు వారి పరిధిలో గల పాఠశాలలు, హాస్టల్లు, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న అన్ని మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు వారి పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలు, సంక్షేమ హాస్టల్లు, అంగన్వాడీ కేంద్రాలను, కేజీవీబీలను తనిఖీ చేశారు.





